క్లుప్తంగా

నేటి నుంచి పెద్దింటమ్మ కల్యాణోత్సవాలు


పెద్దింటమ్మ

ఆకివీడు : ఆకివీడు గ్రామ దేవత పెద్దింటమ్మ (జలదుర్గ సమేత శక్తీశ్వర స్వామి) వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల రెండో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివారం ఉదయం సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనము, త్రిశూల పూజ ఉంటుంది. సోమవారం రాత్రి జలదుర్గ, శక్తీశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 4వ తేదీన గ్రామోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

క్రీడా పోటీల్లో నాగలక్ష్మికి ప్రథమ స్థానం


భీమవరం సీతాపాలిటెక్నిక్ కళాశాలలో నాగలక్ష్మిని అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల, బాలికల ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్ బాలికల విభాగంలో భీమవరం బి సీతాపాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని పి నాగలక్ష్మి హైజంప్‌లో ప్రథమస్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ సీహెచ్ రామకృష్ణ చెప్పారు. శనివారం నాగలక్ష్మిని కళాశాలలో అభినందించిన సందర్భంగా విలేకర్లకు వివరాలను వెల్లడించారు. నాగలక్ష్మి ఫిబ్రవరిలో కర్నాటకలో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థిని రామకృష్ణ, డైరెక్టర్ జి శ్రీనివాసరావు, పీడీ జీబీఎస్ కుమార్‌రాజు అభినందించారు.

అగ్నిప్రమాదంలో కూరగాయల దుకాణం దగ్ధం


అగ్నిప్రమాదంలో దగ్ధమైన కూరగాయల దుకాణం

భీమవరం: భీమవరంలోని గరగపర్రు రోడ్డులోని కొవ్వాడ వెళ్లే మార్గంలో అగ్నిప్రమాదం సంభవించి సుమారు రూ.లక్ష విలువైన కూరగాయల దుకాణం దగ్ధమైంది. శనివారం తెల్లవారుజామున యు. నానికి చెందిన కూరగాయల దుకాణంలో మంటలు చెలరేగాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఏడీఎఫ్‌వో సీహెచ్ సూర్యప్రకాశరావు తన సిబ్బందితో వచ్చి మంటలు అదుపు చేశారు. దుకాణంలో కూరగాయలు, సామగ్రి కాలిపోవడంతో రూ.లక్ష నష్టం ఏర్పడినట్లు అంచనా వేశామని సూర్యప్రకాశరావు చెప్పారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదన్నారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడం వల్లనే ప్రమాదం జరిగి ఉంటుందని బాధితుడు నాని వాపోయాడు.

సహాయ పౌర సంబంధాల అధికారి బాధ్యతల స్వీకరణ


కేటీఎంకేఎస్ సత్యనారాయణ రాజు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డీపీఆర్వో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కేటీఎంకేఎస్ సత్యనారాయణ రాజుకు ఏపీఆర్వోగా (సహాయ పౌర సంబంధాల అధికారి) పదోన్నతి కల్పిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ విజయవాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమాచార శాఖ కార్యాలయంలో శనివారం ఉదయం సత్యనారాయణ రాజు ఏపీఆర్ఓగా బాధ్యతలను స్వీకరించారు.
ఈ సందర్భంగా డీపీఆర్వో టి.నాగేశ్వరరావు, పబ్లిసిటీ అసిస్టెంట్ సీహెచ్ శ్రీనివాస్ నెహ్రూ, టైపిస్ట్ కె.జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ పి.రవి తేజ, రికార్డ్ అసిస్టెంట్ డి.సోమరాజు, ఫోటోగ్రాఫర్ పి వై రత్నాకర్, సిబ్బంది పి.వీరభద్రం, జె.రాజేష్ బాబు, రెడ్డి వైశాలి, అభినందనలు తెలిపారు.

ఎన్నికల కోడ్ పాటించండి

ఆకివీడు : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ ఎన్ వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికలకు మండలంలో 2043 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మార్చి 3న ఎన్నికలు ఉంటాయని, కోడ్ అమలులో ఉటుందని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాయకులు పుప్పాల పండు, బొల్లా వెంకట్రావు, గంధం ఉమ, శింగులూరి చిట్టిబాబు, డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్, ఆర్ఐ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

కలెక్టర్ నాగరాణి


కాళ్ల హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

కాళ్ల: పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. శనివారం ఆమె కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ప్రత్యేక తరగతులను పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమౌతాయని, ఈ ఫలితాల్లో మన జిల్లాను రాష్ట్రంలోని ప్రథమ స్థానం నిలిచేలా సమష్టిగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థినుల రక్షణ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం కాళ్ల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెంట హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎ.శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు, డీఆర్డీఏ పీడీ వేణుగోపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పథకాలు, పనిముట్లపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మంగపతిరావు

ఆకివీడు : ప్రభుత్వ పథకాలు, ఆధునిక పనిముట్లపై అవగాహన కలిగినప్పుడే చేతి వృత్తి దారులు వారి వృతి నైపుణ్యంలో రాణిస్తారని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మంగపతిరావు అన్నారు. వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పీఎం విశ్వ కర్మ యోజన పథకంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం శనివారం స్థానిక వి.కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంగపతిరావు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు గ్రూపుగా ఏర్పడిన వ్యక్తులకు రూ.30 కోట్లు వరకు రుణం ఇస్తారని, ఇందులో రూ.24 కోట్లు ఉచితమే అని చెప్పారు. ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ చేతి వృత్తిదారులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు రూ.లక్ష రుణం కల్పిస్తున్నట్టు తెలిపారు. విశ్వ కర్మ యోజన పథకంలో జిల్లాలో వచ్చిన 60 వేల దరఖాస్తుల్లో అధికంగా టైలరింగ్, దోబీ, తాపీ పనివార్లవేనని వివరించారు. వీరిలో అర్హులకు శిక్షణ ఇస్తామన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకంపై డీపీఎంయూ ఉదయ కుమార్ వివరించగా, సదస్సుకు ప్రిన్సిపాల్ కె.సుజాత అధ్యక్షత వహించారు. కళాశాల సీపీడీసీ కార్యదర్శి పీబీ ప్రతాప్ కుమార్, యూనిట్ పరిశీలకులు డీవీ సత్యనారాయణ, స్వర్ణకారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పట్నాల శేషగిరిరావు, తాపీ మేస్త్రుల సంఘం ప్రతినిధి ధనరాజు, వడ్రంగి మేస్త్రుల సంఘం ప్రతినిధి రాంబాబు మాట్లాడారు. సదస్సుకు చేతివృత్తి దారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ప్లాస్టిక్ వినియోగంపై జేసీ ఆగ్రహం

- మద్యం షాపుల్లో తనిఖీలు
- ఎక్సైజ్ పాలసీకి విరుద్ధంగా వ్యవహరిస్తే కేసు తప్పదని హెచ్చరిక


మద్యం షాపులో తనిఖీ చేస్తున్న జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): ఫిబ్రవరి 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ భీమవరం పట్టణంలోని పలు వైన్ షాపులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాంబే స్వీట్స్ సెంటర్, అంబేడ్కర్ సర్కిల్, కొత్త బస్టాండు, చిన్న రంగనిపాలెం, విస్సా కోడేరు వంతెన ప్రాంతాల్లోని మద్యం షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్లాస్టిక్ గ్లాసులను, ప్లాస్టిక్ బాటిళ్లు కలిగి ఉండడం గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్న విషయం మీకు తెలుసా లేదా అని ప్రశ్నించారు. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు కలిగి ఉన్న ఈ ఆరు షాపులపై జరిమానాకు సిఫార్సు చేస్తూ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలిచ్చారు. ఎక్సైజ్ పాలసీకి విరుద్ధంగా షాపుల వద్ద తాగడానికి (లూజ్ సేల్స్) ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నిస్తూ, ఇటువంటి వైన్ షాపులపై కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. నెల రోజులుగా ప్లాస్టిక్‌పై పెద్ద ఎత్తున అవగాహన కలిగిస్తున్నా ఇంకా అదే దారిలో నడవడంపై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇక తరచూ తనిఖీలుంటాయని ఎక్కడ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయకపోయినా, ఎక్సైజ్ పాలసీకి విరుద్ధంగా అమ్మకాలు జరిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల సందర్భంలో ఎక్సైజ్ శాఖ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ కేఎస్‌వీ కల్యాణ్ చక్రవర్తి, ఎస్సై రమాదేవి, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులను మోసం చేసిన కూటమి సర్కార్


ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఎగనామం పెట్టి కూటమి సర్కార్ రాష్ట్రంలో లక్షలాదిమంది విద్యార్థులను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కళాశాల విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలుఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 5న కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఫీజు పోరు ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పార్టీ నాయకులు, విద్యార్థులకు పిలుపు ఇచ్చారు. పార్టీ చేపట్టిన ఫీజుపోరు ఆందోళన కార్యక్రమం పోస్టర్‌ను శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఒక్క హామీ కూడా అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ పిల్లల అమ్మఒడి పథకాన్ని ఎగ్గొట్టిన కూటమి సర్కార్ కళాశాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా చేసిందన్నారు. కళాశాలల యాజమాన్యాల ఒత్తిళ్లతో అప్పులు చేసి ఫీజులను తల్లిదండ్రులు కట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. విద్యార్థులకు అండగా 5న కలెక్టరేట్‌ల వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, పట్టణ అధ్యక్షుడు కామన బుజ్జి, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, బర్రి శంకరం, గోరు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ వాహనాల డ్రైవర్ల సమ్మె


మునిసిపల్ కార్యాలయంలో సమ్మె చేస్తున్న తడిచెత్త, పొడిచెత్త సేకరణ వాహన డ్రైవర్లు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మునిసిపాల్టీలో తడి చెత్త, పొడిచెత్త విడివిడిగా సేకరించే వాహనాల డ్రైవర్లు వాహనాలు నిలిపి వేసి శనివారం సమ్మె నిర్వహించారు. పూణేకి చెందిన స్వయంభూ సంస్థ ప్రైవేట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో 19 మంది డ్రైవర్లు పాలకొల్లు మునిసిపాల్టీలో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించే వాహనాలపై పని చేస్తున్నారు. అయితే వీరికి గత మూడు నెలలుగా సంస్థ జీతాలు చెల్లించడం లేదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గతేడాది నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని డ్రైవర్లు చెబుతున్నారు. ప్రతి నెలా 7వ తేదీలోగా జీతాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని, వారంలో ఒక రోజు సెలవు ఇవ్వాలని, పనికి తగిన వేతనం అమలు చేయాలని, మెడికల్ లీవ్ ఇవ్వాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యలు తక్షణం పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని డ్రైవర్లు చెబుతున్నారు.

ఆబోతు మూగ రోదన

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు – పూలపల్లి బైపాస్‌రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి దిగువన ఆబోతును శనివారం గుర్తు తెలియని తీవ్రంగా గాయపడింది. ఆ వాహనం ఆబోతును కొంత దూరం ఈడ్చుకెళ్లినట్లు ఆనవాళ్లున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆంబోతు మూగగా రోధించింది. ఆంబోతు కళ్లలోంచి నీరుధారకట్టిన ఆనవాళ్లు పడ్డాయి. విషయాన్ని స్థానికులు సాయంత్రం సమయంలో పూలపల్లి పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీను దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన స్పందించి, వెటర్నరీ డాక్టర్‌ని పిలిపించి వైద్యం చేయించారు. రాత్రికి పారిశుద్ధ్య కార్మికుడిని కాపలా ఉంచుతానని, ఆదివారం ఉదయం కోలుకుంటే వెటర్నరీ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తామని తెలిపారు.

వైభవంగా వెంకన్న విగ్రహ ప్రతిష్టాపన

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాల ఆవరణలో భవనాల నిర్మాణం నిమిత్తం తవ్వుతుండగా 1965లో ఓ వేంకటేశ్వరస్వామి విగ్రహం లభ్యమైంది అయితే అప్పటి నుంచి అక్కడే విగ్రహానికి సాధారణంగా పూజలు నిర్వహించే వారు. ఇటీవల కళాశాల ఆవరణకు ఆనుకుని ఓ మందిరాన్ని నిర్మించారు. ఆ మందిరంలో శనివారం విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రక్షణ గోడ నిర్మాణ ప్రాంతం పరిశీలన

నరసాపురం రూరల్: కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామమైన పెదమైనవానిలంకలో సముద్రపు కోత నివారణకు గోడ నిర్మించబోయే ప్రాంతాన్ని శనివారం ఆర్డీఓ దాసి రాజు పరిశీలించారు. దీనికి సంబంధించి డిలైట్ అనే సంస్థ రక్షణ గోడ నిర్మిస్తుందని, రక్షణ గోడ నిర్మాణానికి స్థానికులంతా సహకరించాలని ఆర్డీఓ గ్రామస్తులకు వివరించారు. రక్షణ గోడ నిర్మాణం వల్ల తీరం కోతకు గురి కాకుండా ఉంటుందని ఆర్డీఓ పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ తలారి రాజ రాజేశ్వరి, ఆర్ఐ ఎం.లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు


మార్టేరు వద్ద రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

పెనుమంట్ర: మార్టేరు–పాలకొల్లు రోడ్డులో మార్టేరు వద్ద ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. మార్టేరు సెంటర్ నుంచి కనకదుర్గ ఆలయం వరకు 700 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు నిర్మించి ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా రోడ్డు నిర్మించడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నరసాపురం–అశ్వారావుపేట రహదారిని పాలకొల్లు నుంచి మార్టేరు వరకు 11 కిలో మీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్డును విస్తరించి పటిష్ఠ పరిచేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి, చెరుకువాడ శ్రీరంగనాధరాజు కృషితో రూ. 25 కోట్లు నిధులు మంజూరు చేసారు. దాంతో 2024 జనవరి 28న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఈ రోడ్డు నిర్మాణానికి కవిటం వద్ద శంకుస్థాపన చేశారు. వెంటనే పనులు ప్రారంభించి నరసాపురం కాలువ ఒడ్డున రోడ్డు పొడవునా రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పూర్తి చేశారు. అయితే తదుపరి ఎన్నికల కోడ్ రావడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పనులు ప్రారంభించిన అధికారులు మార్టేరు సెంటర్ నుంచి కనకదుర్గ గుడి వరకు 700 మీటర్లు సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను నేటికి తొలగించలేదు. దీనిపై పెనుమంట్ర ఎలక్ట్రికల్ ఏఈ జి.నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాల విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు.

అనాథ పిల్లలను ఆదుకోవాలి


చినఅమిరంలో ఇమ్మాన్యుయేల్ చిల్డ్రన్స్ హోమ్‌లో విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దాంట్లో కొంత సమాజానికి కేటాయిస్తే మానవతా ధృక్పథంతో అనాథ పిల్లలను ఆదుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరంలో విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇమ్మాన్యుయేట్ చిల్డ్రన్ హోమ్‌లో శనివారం 50 మంది విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం మాట్లాడుతూ అనాథ పిల్లలకు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వారికి సహాయాన్ని అందించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇమ్మాన్యుయేల్ చిల్డ్రన్స్ హోమ్‌లోని విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణిస్తున్నారని, కరాటేలో జాతీయ స్థాయిలో అవార్డులు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులకు రగ్గులు అందించిన బ్యాంక్ ఆఫ్ బరోడా చినఅమిరం శాఖ మేనేజర్ జయంతు కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అరసవల్లి మణికంఠ వెంకటేష్, ఎర్నెస్ట్ పాల్ పాల్గొన్నారు.

ప్రజల్లోకి అంబేడ్కర్ ఆశయాలు


సునీల్‌కుమార్‌తో మధు, చినకృష్ణమూర్తి

ఉండి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాజ్యాంగ స్ఫూర్తిని నింపుతామని అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) జిల్లా ఇన్‌చార్జి బండి మధు అన్నారు. ఏఐఎం వ్యవస్థాపకుడు పీవీ సునీల్‌కుమార్‌ను గుంటూరులోని ఆయన స్వగృహంలో శనివారం యండగండి సర్పంచ్, ఏఐఎం నాయకుడు గొగులమండ చినకృష్ణమూర్తి తదితరులతో మధు కలిశారు. తనను ఏఐఎం జిల్లా ఇన్‌చార్జిగా నియమించినందుకు సునీల్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం యండగండిలో వారు మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, వారి హక్కులు, విధులు, బాధ్యతలను తెలియజేస్తూ ముందుకు సాగుతామన్నారు. అన్ని సామాజికవర్గాల ప్రజలతో పాటు సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగం ద్వారా సంక్రమించే ఎన్నో హక్కులను వివరిస్తామని తెలిపారు. ఎస్సీలపై దాడులను అరికట్టి, వారికి న్యాయ జరిగేలా చూస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏఐఎం జిల్లా కన్వీనర్ చిన్నారావు, సోషల్ మీడియా ఇన్‌చార్జి ధర్మేంద్ర, ఏఐఎం నాయకులు వెలగపల్లి టోనీ తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ సస్పెన్షన్‌పై ఆర్టీసీ ఉద్యోగుల నిరసన


డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

భీమవరం(ప్రకాశం చౌక్): అక్రమంగా సస్పెన్షన్ చేసిన మెకానిక్ యూవీ రావును వెంటనే విధుల్లోకి తీసుకోవాలని భీమవరం డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఆందోళన చేపట్టారు. యూనియన్ ఆధ్వర్యంలో 11వ రోజు డిపోలో ఉద్యోగుల నిరసనన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ యూవీ రావుపై అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేసి ఆయనను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లిన 33 సమస్యలను పరిష్కరించకుండా ఆయన కాలయాపన చేస్తున్నారన్నారు. ఉద్యోగులను విచారణ పేరుతో వేధించడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అర్గనైజింగ్ కార్యదర్శి పి.సోమరాజు, జోనల్ సభ్యులు పివి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వైవీరావు, డిపో కార్యదర్శి నందు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


భీమవరం చినరంగంపాలెం మునిసిపల్ స్కూల్లో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

భీమవరం: మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులంతా స్వీకరించే విధంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మధ్యాహ్నం భోజనం, పాఠశాల పారిశుద్ధ్య జిల్లా కోఆర్డినేటర్ కె కృష్ణారావు అన్నారు. శనివారం భీమవరంలోని చినరంగనిపాలెం పస్తులసాగరం మున్సిపల్ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్నం భోజనం, పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మెనూతో పాటు గుడ్లు, చిక్కీలు, రాగి జావ ఇస్తున్నందున బడి భోజనం చేయాలని కోరారు. స్కూల్లోని రికార్డులు, రిజిస్టర్లు బియ్యం, గుడ్లు, చిక్కిల నిల్వలు పరిశీలించారు. అనంతరం రక్తహీనత కలిగిన విద్యార్థులకు ఐరన్ ట్యాబ్లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోడి వెంకట్రావు పాల్గొన్నారు.

బోల్తా పడిన లారీ


తిరుగబడిన లారీని పైకి లేపుతున్న దృశ్యం

ఉండి: స్థానిక బస్టాండ్ ఎదుట ఎన్నార్పీ అగ్రహారం పరిధిలోని రోడ్డు మలుపు వద్ద లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి నుంచి భీమవరం వైపుగా వెళుతున్న లారీని భీమవరం నుంచి ఉండి వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో లారీ వెనుక చక్రాలు ఊడిపోయి బోల్తా పడింది. మరోవైపు కారు నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో లారీ, కార్లలో ఉన్న ఏ ఒక్కరికీ ఎటువంటి గాయాలూ కాకపోవడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి కొన్ని వాహనాలు వాండ్రం రోడ్డు నుంచి భీమవారం వైపు మళ్లించారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు.

చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం

కాళ్ల: అనేక జీవరాసులు, మానవ మనుగడ, పర్యావరణ పరిరక్షణకు చిత్తడి నేలలు అవసరం ఎంతో ఉందని రైతు కార్యచరణ సమితి సభ్యులు మంతెన రవి వర్మ అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవ సందర్భంగా శనివారం ఆటపాక పక్షుల అభయారణ్యంలో చిత్తడి నేలల ప్రాముఖ్యతపై కొల్లేరు సరస్సు అభివృద్ధి సమితి, స్పేస్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.